ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

సిద్దిపేట

5

మంగళవారం 23 ఏప్రిల్ 2024



చేనేత రంగంలో మహిళలు రాణించాలి

● చేనేత, జౌళిశాఖ రాష్ట్ర కమిషనర్ అలుగు వర్షిణి

7 లో..

## లోక్‌సభ ఎన్నికల ప్రచార షెడ్యూల్ విడుదల



పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లోని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, నాయకుల సమావేశంలో ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి

-పటాన్‌చెరు

## ఉల్లిగడ్డ విక్రయం పేరిట బురిడీ

● వృద్ధులే లక్ష్యంగా నకిలీ నోట్లు



నకిలీ వంద రూపాయల నోటు

చేర్యాల, ఏప్రిల్ 22: తక్కువ ధరకు ఉల్లిగడ్డలు విక్రయిస్తున్నామంటూ గ్రామాల్లో తిరుగుతూ వ్యాపారం చేస్తున్న కొందరు నకిలీ నోట్లు ఇస్తూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. తెల్లవారుజామునే గ్రామాల్లోకి వచ్చి వాహనంలో ఉల్లిగడ్డలు విక్రయిస్తూ గంటల వ్యవధిలోనే వెళ్లిపోతున్న క్రమంలో వృద్ధులనే ఎంచుకుని నకిలీ నోట్లు అందించి మోసం చేస్తున్నారు. అందుకు చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో చోటుచేసుకున్న సంఘటన నిదర్శనం. కడవేరుగుకు చెందిన ఓ వృద్ధురాలు సోమవారం గ్రామానికి వచ్చిన ఓ వ్యాపారి వద్ద ఉల్లిగడ్డ కొనుగోలు చేసి రూ.200 నోటు ఇచ్చింది. అతడు రూ.100 నోటుతో పాటు మిగతా చిల్లరను ఆమెకు ఇచ్చాడు. కొద్దిసేపటి తరువాత సెల్‌ఫోన్ రీచార్జి చేసుకునేందుకు వృద్ధురాలు గ్రామంలోని ఓ కిరాణా దుకాణానికి వెళ్లి రూ.100 నోటు ఇచ్చింది. తీరా అది చిన్నపిల్లలు ఆటాడుకునే నకిలీ నోటుగా దుకాణ యజమాని గుర్తించాడు. ఎవరు ఇచ్చారని అడగడంతో ఉల్లిగడ్డ అమ్మిన వారు ఇచ్చారని తెలిపి ఖంగుతింది.. విషయం తెలిసిన చుట్టుపక్కలవారు వెతకగా అప్పటికే సదరు వ్యాపారి గ్రామం నుంచి ఉడాయించాడు. ఈ విషయమై మరింతమంది మోసపోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయం కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## నాలుగో రోజు 14 నామినేషన్లు

మెదక్‌అర్బన్/సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మెదక్, జహీరాబాద్ నియోజకవర్గాలకు నాలుగోరోజు సోమవారం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ నియోజకర్గానికి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. తుపాకుల మురళీకాంత్ (తెలంగాణ రాజ్య సమితి), డి.శ్రీశైలం (స్వతంత్ర), తుమ్మల్లపల్లి పృథ్వీరాజ్ (స్వతంత్ర), వరికోలు శ్రీనివాస్ (స్వతంత్ర), ఎడ్ల రవికుమార్ (స్వతంత్ర), కె.లక్ష్మీనారాయణ (స్వతంత్ర), మైసాగారి సునీల్ (ఇండియా ప్రజాబంధు పార్టీ) నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో ఇప్పటి వరకు 24 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన వెల్లడించారు.

జహీరాబాద్ నియోజకవర్గానికి ఏడు నామినేషన్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. బీబీ పాటిల్ (బీజేపీ), సురేష్ కుమార్ షెట్కార్ (కాంగ్రెస్), కొత్తబలిజ బస్వరాజ్ (తెలంగాణ ప్రజా శక్తి పార్టీ), ఎం.మోహన్‌రెడ్డి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), స్వతంత్ర అభ్యర్థులుగా రమేష్, రవిమహదేవ్ స్వామి, గంగారాములు నామినేషన్లు దాఖలు చేసినట్టు పేర్కొన్నారు.



స్మార్ట్ దుకాణదారుడికి జరిమానా పత్రాన్ని అందజేస్తున్న మునిసిపల్ అధికారులు

## పురుగులు పట్టిన ఐస్‌క్రీం విక్రయం

● దుకాణానికి రూ.10వేల జరిమానా

గజ్వేల్, ఏప్రిల్ 22: పురుగులు పట్టిన ఐస్‌క్రీం విక్రయించిన స్మార్ట్ దుకాణానికి రూ.10వేల జరిమానా విధించినట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని స్మార్ట్ దుకాణంలో పురుగులు పట్టిన ఐస్ క్రీం అమ్మారని ప్రజ్ఞాపూర్‌కు చెందిన గొడుగు రాజు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌ను తనిఖీ చేయాలని కమిషన్ ఆదేశించారు. ఈ మేరకు స్మార్ట్ దుకాణంలో తనిఖీలు జరిపిన అనంతరం రూ.10వేల జరిమానా విధించారు. గడువు(ఎక్స్‌పైరీ) ముగిసిన వస్తువులు, తినుబండారాలను విక్రయిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ నర్సయ్య హెచ్చరించారు.

## మాట తప్పిన కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

● మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డిటౌన్, ఏప్రిల్ 22 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదని బీఆర్‌ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లిలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్, మెదక్ నియోజకవర్గాల అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, వెంకట్రాంరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు సవాల్

లోక్‌సభ ఎన్నికల ప్రచారం క్రమంగా ఊపందుకుంటోంది. నామినేషన్ల సమర్పణకు ఈనెల 25 వరకు గడువు ఉంది. 29న ఉపసంహరణ ఘట్టం ముగియగానే ప్రచారపర్వం మరింత పుంజుకుంటుంది. ఇప్పటికైతే ప్రచారానికి కేవలం 19 రోజులు మాత్రమే మిగిలింది. మే 13న పోలింగ్ జరుగుతున్న దృష్ట్యా ఒకరోజు ముందుగా అంటే మే 11న ప్రచార కార్యక్రమాలు ముగించాలి. ఈ కాస్త సమయంలో గ్రామగ్రామాన పర్యటించడం అభ్యర్థులకు సవాల్‌గా మారనున్నది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 22



### ప్రచారానికి 19 రోజులే సమయం

● మండల కేంద్రాలు, పట్టణాలకే పరిమితం

● సభలు, రోడ్‌షోల్లో గళమెత్తుతున్న వైనం

● క్షేత్రస్థాయిలో కానరాని ప్రచారం ● దడ పుట్టిస్తున్న మండుటెండలు

మెదక్ లోక్‌సభ పరిధిలోని 7 నియోజకవర్గాలకు సంబంధించి 49 మండలాలు, 920 గ్రామపంచాయతీలు, 12 మున్సిపాలిటీలు, 3 జీహెచ్‌ఎంసీ డివిజన్లు ఉన్నాయి. అదే విధంగా 18,12,858 మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి 2,124 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### సభలు, రోడ్‌షోలపై ఫోకస్

ప్రధాన పార్టీల అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ఇప్పటివరకైతే ప్రచారానికి దిగలేదు. ఇంకా సమయం తక్కువగా ఉండడంతో పట్టణాలు, మండలాల వారీగానే ప్రజలతో సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి. అభ్యర్థులుగా ఖరారైనప్పటి నుండే బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రధానంగా తమ పార్టీ శ్రేణులతో సమావేశాలకే ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి తమ వాణిని వినిపించారు. సంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభకు హాజరుకాగా.. ఇటీవల మెదక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఈనెల 25న సిద్దిపేట బీజేపీ తరఫున అమిత్‌షా సభ జరగబోతుంది. ఇవే కాకుండా అభ్యర్థులు, వారితోపాటు ఇతర ప్రాంతాల ముఖ్యనేతలు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటా వెళ్లి ప్రచారం నిర్వహించేంత సమయం లేకపోవడంతో ఎక్కడికక్కడ జనసమీకరణ చేసి రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, సమావేశాలు చేపడుతున్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలో మరోసారి కేసీఆర్ సభ, రాహుల్ లేదా ప్రియాంక సభ, ప్రధాని మోదీతో బహిరంగ సభ జరిగేలా ఆయా పార్టీల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు.

### ఎండతో అభ్యర్థుల పరేషాన్..

మండుటెండల్లో లోక్‌సభ ఎన్నికలు జరగడం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. సాధారణంగా ఉదయం 10 గంటల తర్వాతనే సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు స్పందన కనిపిస్తుంటుంది. కానీ ఉదయం 9గంటలకే ఎండలు భగ్గుమంటున్నాయి. మెదక్ లోక్‌సభ పరిధి మొత్తం ఆరెంజ్ అలర్ట్ జోన్‌లో ఉంది. ఇటీవల సిద్దిపేట జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఒకింత ఆందోళనను కలిగించింది. ఈ క్రమంలో అభ్యర్థుల సమావేశాలకు జనసమీకరణ కష్టమవుతోంది. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే ప్రచారం చేస్తున్నారు. ఆ తర్వాత అంతర్గత సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. మళ్లీ సాయంత్రం 5 గంటల తర్వాతనే కాలు బయటపెడుతున్నారు. దీంతో వారి ప్రచార ప్రణాళిక సైతం తలకిందులవుతోంది. మిగిలిన సమయంలో అన్ని గ్రామాల్లో పర్యటించడం సవాల్‌గానే మారిందని అంటున్నారు. ఒక గ్రామానికి వెళ్లి మరో గ్రామానికి వెళ్లకున్నా ప్రతికూల పరిస్థితి ఎదురవుతుందని మండల కేంద్రాలు, పట్టణాలకే పరిమితమవు తున్నారు. అయితే కొన్ని ప్రభావం చూపించే గ్రామాలు, మేజర్ గ్రామాలకు మాత్రం అభ్యర్థులు ప్రాధాన్యతనిచ్చి ప్రచారం చేస్తున్నారు. లేదంటే ఆయా ప్రాంతాలకు చెందిన ముఖ్యనేతలను ప్రచారంలో దింపుతున్నారు.

| నియోజకవర్గం | గ్రామాలు |
|---|---|
| సిద్దిపేట | 88 |
| మెదక్ | 150 |
| నర్సాపూర్ | 212 |
| సంగారెడ్డి | 86 |
| పటాన్‌చెరు | 55 |
| దుబ్బాక | 150 |
| గజ్వేల్ | 179 |
| **మొత్తం** | **920** |

| జీహెచ్‌ఎంసీ డివిజన్లు |
|---|
| 1. పటాన్‌చెరు |
| 2. రామచంద్రాపురం |
| 3. భారతీనగర్ |

| మున్సిపాలిటీలు |
|---|
| 1. సిద్దిపేట |
| 2. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ |
| 3. తూప్రాన్ |
| 4. దుబ్బాక |
| 5. మెదక్ |
| 6. నర్సాపూర్ |
| 7. సంగారెడ్డి |
| 8. సదాశివపేట |
| 9. అమీన్‌పూర్ |
| 10. బొల్లారం |
| 11. తెల్లాపూర్ |
| 12. రామాయంపేట |

### ప్రచార రథాలు, సోషల్‌మీడియాపై దృష్టి..

ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రధానంగా సోషల్ మీడియాపై ఆధారపడుతున్నారు. తమ ప్రచార వీడియోలు, ఫొటోలను క్షణాల్లో వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారు. తమ హామీలతోపాటు ప్రత్యర్థుల లోపాలను ఎత్తి చూపుతూ వీడియోలు, పోస్టులను సోషల్ మీడియా ద్వారా చేరవేస్తున్నారు. చెవులు హోరెత్తేలా ప్రచార రథాలను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో తిప్పుతున్నారు. తమపై వ్యక్తిగతంగా రాసిన పాటలతో పాటు ఆయా పార్టీలకు సంబంధించిన పాటలు, సందేశాలను వినిపిస్తూ ఈ ప్రచార రథాలు ఊరూరా చక్కర్లు కొడుతున్నాయి. ఆయా గ్రామాల రచ్చబండల వద్ద కళాబృందాల ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అభ్యర్థుల ముఖాలను ప్రత్యక్షంగా ఎరుగకున్నా ఇలాంటి ప్రచారాల ద్వారా మాత్రం ప్రజలకు ఎంతో కొంత అవగాహన కలుగుతోంది.

## చికెన్ సెంటర్ యజమాని హత్య

● పనిచేసిన వారే చంపేసి ఉంటారని కుటుంబీకుల ఆరోపణ

● పరారీలో ఇద్దరు బీహారీ యువకులు

● గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 22: చికెన్ సెంటర్ నిర్వాహకుడు హత్యకు గురైన సంఘటన జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి తూప్రాన్ మండలం వెంకటాపూర్ పిటి గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి(40) జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ రాంరెడ్డి చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. చికెన్ సెంటర్‌లో పనిచేయడానికి బీహార్‌కు చెందిన ఇద్దరు యువకులను నెల క్రితం పనిలో చేర్చుకున్నాడు. మహిపాల్‌రెడ్డి ప్రతి ఆదివారం తన సొంత గ్రామమైన వెంకటాపూర్ పిటి గ్రామానికి వెళ్లి మరుసటి రోజు తిరిగి జగదేవ్‌పూర్‌కు వస్తుంటాడు. ఆదివారం కుటుంబసభ్యులు ఫోన్ చేసి బంధువుల ఇంట్లో శుభకార్యం ఉంది. ఎప్పుడు వస్తావని ఫోన్ చేయగా సోమవారం ఉదయం చికెన్ ఆర్డర్ ఉందని అది అయ్యాక వస్తానని చెప్పాడు. అదేరోజు సాయంత్రం కుటుంబీకులు మళ్లీ మహిపాల్‌రెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సోమవారం ఉదయం కూడా స్విచ్ఛాఫ్ రావడంతో పక్కనే ఉన్న ఇతర షాపు నిర్వాహకులకు ఫోన్ చేయగా దుకాణం మూసి ఉన్నట్లు చెప్పారు. మృతుడి తమ్ముడు శ్రీపాల్‌రెడ్డి, బావ కరుణాకర్‌రెడ్డి చికెన్ దుకాణాన్ని తెరిచి చూడగా ఓ రూంలో మహిపాల్ మృతదేహాన్ని వస్త్రంలో చుట్టి కనిపించింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలో సీసీ కెమెరాల వైర్లను తొలగించి హార్డ్ డిస్క్ కింద పడి ఉండడాన్ని గమనించారు. క్లూస్ టీంకు డబ్బు, మద్యం బాటిళ్లు, కాలిన సిగరెట్‌లు లభించాయి. చికెన్ షాపులో పనిచేసే బీహార్‌కు చెందిన ఇద్దరు యువకులు కనిపించడకుండా పోవడంతో మహిపాల్‌రెడ్డిని వారే హత్య చేసి పారిపోయి ఉంటారని మృతుడి కుటుంబీకులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.



మహిపాల్‌రెడ్డి(ఫైల్)



చికెన్ దుకాణంలో ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు



## వెయ్... చిందేయ్..

హుస్నాబాద్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అయితే, ఆయనకు అంబేడ్కర్ చౌరస్తాలో గిరిజనులు, కార్యకర్తల ఘనస్వాగతం పలికారు. గిరిజన మహిళలతో కలిసి బండి సంజయ్ నృత్యం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ర్యాలీగా సమావేశ స్థలానికి చేరారు.

- హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 22

## ఈనెల 25న అమిత్‌షా సభ

● మూడు నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ

● మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



సిద్దిపేట క్రైం/దుబ్బాక/మిరుదొడ్డి, ఏప్రిల్ 22 : ఈనెల 25న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరగనున్న సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు తెలిపారు. సభకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని చెప్పారు. సోమవారం ఆయన దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమిత్‌షా సభకు సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. మూడు నియోజకవర్గాల్లోని 27 మండలాల నుంచి 30వేల మందిని సభకు తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భూ నిర్వాసితులకు అప్పటి పరిహారాన్ని మార్చి కొత్తచెక్కులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని, ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రభుత్వ అధికారులు పనిచేయాలని సూచించారు. అనవసర విషయాలకు వెళ్లి ఇబ్బందులకు గురికావద్దని చెప్పారు. అనంతరం అమిత్ షా పాల్గొనే సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తప్పదన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జాలిగామ ఉపేందర్, బీజేపీ నాయకులు గురువారెడ్డి, వేణు గోపాల్ బాలేష్‌గౌడ్, రోశయ్య, భిక్షపతి, మల్లేశం, దుబ్బాక, మిరుదొడ్డి మండల అధ్యక్షులు దేవరాజు, సుభాష్‌రెడ్డి, పలువురు ఉన్నారు.



మద్దూరు మండలంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టె

## నిరుపయోగంగా నీటితొట్టెలు

● దాహార్తితో అల్లాడుతున్న మూగజీవాలు ● మరమ్మతులు చేపట్టని అధికారులు

మద్దూరు, ఏప్రిల్ 22: గ్రామపంచాయతీల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో పశువుల దాహార్తిని తీర్చే నీటితొట్టెలు ఎనిమిదేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా వేసవిలో మూగజీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. మద్దూరు ఉమ్మడి మండలంలోని 23 గ్రామాల్లో 2005లో 35 నీటితొట్టెల నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో నీటితొట్టెకు రూ.12 వేల చొప్పున రూ.4.20లక్షలు ఖర్చు చేసి నీటి వసతి కోసం నల్లా కనెక్షన్ కూడా ఇచ్చారు. అయితే కొన్నిరోజులకే నీటి తొట్టెలకు పగుళ్లు ఏర్పడడంతో నీరు నిల్వ ఉండడం లేదు. పశుపోషకుల ఆందోళన చేయడంతో ఉపాధిహామీ పథకంలో బెక్కల్‌కు-2, మర్మాములకు-3, బైరాన్‌పల్లికి-2, కమలాయపల్లికి-1 చొప్పున నీటితొట్టెలు కేటాయించారు. ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి రూ.19,958 చొప్పున రూ.1,59,556 ఖర్చు చేశారు. గ్రామపంచాయతీల నిర్లక్ష్యంతో పాటు అధికారులు అలసత్వంతో నీటి తొట్టెలూ మూగజీవాలకు ప్రయోజనాన్ని చేకూర్చలేకపోయాయి. పశువైద్యశాల ముందు ఏర్పాటు చేసిన నీటితొట్టెకు పగుళ్లు ఏర్పడి చెత్తాచెదారం నిండిపోయినా నేటికి మరమ్మతులకు నోచుకోలేదు. ఇలా నిరుపయోగంగా మారిన నీటితొట్టెలను వినియోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు.





గుంపులుగా ఉన్న పందులు

జహీరాబాద్ పట్టణంలోని ఆర్యనగర్, గడి, మాణిక్‌ప్రభుమహేశ్‌తోపాటు పలు వీధుల్లో పందులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇళ్లలోకి చొరబడి దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందులను కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- జహీరాబాద్

# భవానమ్మపల్లిలో కొనసాగుతున్న భవానీమాత ఉత్సవాలు

జహీరాబాద్, ఏప్రిల్ 22: మొగుడంపల్లి మండలంలోని భవానమ్మపల్లిలో భవానీమాత జాతర సోమవారం ప్రారంభమైంది. 500 ఏళ్ల కిత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధానికి వెళ్లేముందు భవానమ్మపల్లి(ఖాంజామాల్‌పూర్)లో సేదతీరాడనే చరిత్రను గ్రామస్థులు ఇప్పటికీ చెప్పుకుంటారు. అప్పట్లో యుద్ధంలో విజయం సాధిస్తే భవానమ్మ ఆలయాన్ని నిర్మిస్తానని మొక్కుకున్నాడని, విజయం సాధించాక ఆలయాన్ని నిర్మించాడని గ్రామస్థులు తెలిపారు. అప్పటి నుంచి నేటివరకూ ప్రతియేటా జాతరను నిర్వహిస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం, 23న సామూహిక భోజనాలు, 24న అమ్మవారికి పల్లకీసేవ ఉంటుందన్నారు.

## ఘనంగా బోనాల ఊరేగింపు

కొల్చారం, ఏప్రిల్ 22: కొల్చారం మండల పరిధిలోని వరిగుంతంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా సోమవారం పోచమ్మ, దుర్గమ్మలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలలో భాగంగా జడ్పీటీసీ మేఘమాల బోనమెత్తారు. మంగళవారం ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు బోనాల ఊరేగింపు ఉంటుందని, 24 నుంచి 26వ తేదీవరకు పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. 27, 28వ తేదీల్లో పెద్దమ్మతల్లికి బోనాల ఊరేగింపు, బలి పెద్దమ్మతల్లికి నైవేద్య కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ముత్యంగారి సంతోష్‌కుమార్, సొసైటీ ఛైర్మన్ చిన్నారపు ప్రభాకర్, మాజీ ఛైర్మన్ గుడాల నర్సింహులు, ముదిరాజ్ సంఘం నాయకులు రాజు పాల్గొన్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి ఆలయం

## మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 22: పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురు చూసినా కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఆమె వివరించారు.

# మంజీరాను తవ్వేస్తున్నారు!

● హల్దీవాగు నుంచీ ఇసుక అక్రమ రవాణా
● అడుగంటుతున్న భూగర్భ జలాలు
● పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు


హల్దీవాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం


ఇసుకను తవ్వేయడంతో మంజీరా నదిలో తేలిన బండరాళ్లు

కొల్చారం, ఏప్రిల్ 22: రోజురోజుకూ ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా అడ్డగోలుగా వాగులు, వంకలు తవ్వేస్తున్నారు. అడ్డు వచ్చిన వారిపై దాడులకు సైతం వెనుకంజ వేయడం లేదు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని మంజీరా తీర గ్రామాలైన తుక్కాపూర్, పైతర, ఏటిగడ్డమాందాపూర్, కోనాపూర్, హల్దీవాగు తీర గ్రామాలైన కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్ గ్రామాల నుంచి అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. తుక్కాపూర్, పైతర గ్రామ శివారులో మూడు మీటర్ల లోతులో నుంచి కొంతమంది అక్రమార్కులు ఇసుకను తవ్వేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని తుక్కాపూర్ గ్రామ రైతులు ఇటీవల తహసీల్దార్‌కు వినతిపత్రం సైతం అందజేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్ శివారులోని హల్దీవాగు నుంచి ఇసుకను కొల్చారం, కొడిపల్లి, వెల్మకన్నె, లింగంపల్లి గ్రామాల్లో ట్రాక్టర్ ఒక్కంటికి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డొచ్చిన పోలీసులపై సైతం దాడులకు ఇసుక మాఫియా వెనుకడుగు వేయడం లేదు. ఈయేడు హల్దీవాగులో ఇసుక తవ్వకాలతో బండరాళ్లు తేలాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతులు సాగుచేసిన వరి పొట్ట దశకు చేరుకునే సమయంలో ఎండిపోయింది. నాయిన్ జలాల్‌పూర్ గ్రామంలో ఇసుక మాఫియాను పట్టుకునేందుకు మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుమలేశ్ తన సిబ్బందితో రాగా.. ఇసుక మాఫియా దాడులు చేసే ప్రయత్నం చేశాయి. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### ముందట బైక్.. వెనుక ఇసుక ట్రాక్టర్

ఇసుక మాఫియా ఒక్కోసారి.. ఒక్కో పద్ధతిని పాటిస్తూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. తుక్కాపూర్, నాయిన్ జలాల్‌పూర్ గ్రామాల్లోని వాగులో ఇసుక లోడ్ చేసుకునే వరకు మోటార్ సైకిళ్లపై ఇసుక రవాణా జరిగే రోడ్డు వెంట రెక్కీ నిర్వహిస్తారు. ఇసుక ట్రాక్టర్ బయలుదేరగానే ఒక మోటార్ సైకిల్‌కు.. ఇంకో మోటార్ సైకిల్‌కు అర కిలోమీటర్ దూరం ఉంటూ పోలీసులు వస్తున్నట్లు అనుమానం రాగానే ఫోన్ ద్వారా ఇసుక ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన పొదల చాటుకు దారి మళ్లిస్తారు. లేకుంటే రోడ్డు పక్కనే అన్‌లోడ్ చేసి ఖాళీ ట్రాక్టర్‌తో ఉంటారు.

**ఇసుక అక్రమ రవాణా మా దృష్టికి రాలేదు**

మంజీరా నది, హల్దీవాగు నుంచి రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నదన్న విషయం మా దృష్టికి రాలేదు. ఒకవేళ ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం.

- మహ్మద్ గఫర్ మియా, తహసీల్దార్, కొల్చారం

# బీజేపీతోనే దేశాభివృద్ధి

● దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు


దుద్దెడలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కొండపాక, ఏప్రిల్ 22: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో సోమవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందే.. తప్పా మేలు చేయలేదన్నారు. కొంతమంది చేతుల్లోనే అధికారం కేంద్రీకృతం కావడంతో ప్రజలు విసిగి వేసారి పోయారని పేర్కొన్నారు. వందరోజులకే కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏమీ చేయలేకపోతున్నదన్నారు. దేశ భద్రత, దేశాభివృద్ధిలో ప్రపంచ దేశాలు మనదేశం వైపు చూస్తున్నాయని, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం అగ్రరాజ్యాల వరుసలో నిలిచిందని చెప్పారు. దేశ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీజేపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు ఎంపీపీ సాయిలు రాజీనామా


గజ్జెల సాయిలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 22: మిరుదొడ్డి మండల పరిషత్ అధ్యక్షుడు గజ్జెల సాయిలు సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ కార్యకలాపాల్లో తనకు ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పార్టీ జిల్లా అధ్యక్షుడికి లేఖ రాశారు. ఇక పార్టీలో కొనసాగలేనని స్పష్టం చేశారు.

## అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

● రూ.2 వేల జరిమానా విధించిన సిద్దిపేట సెషన్స్ కోర్టు

దౌల్తాబాద్, ఏప్రిల్ 22: బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి సోమవారం సిద్దిపేట సెషన్స్ కోర్టు పదేళ్ల జైలు, రూ. 2 వేల జరిమానా విధించింది. దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కేసు వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఓ గ్రామంలోని పౌల్ట్రీఫాంలో ఓ బాలిక(15) పని చేస్తూ కుటుంబానికి అండగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన నిందితుడు తలారి శ్రీకాంత్(20) 2021 అక్టోబర్‌లో ఆ బాలికను కిడ్నాప్ చేయడంతో పాటు అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో విధుల నిర్వర్తించిన ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. అప్పటి తొగుట సీఐ రవీందర్ జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపగా, తొగుట సీఐ కమలాకర్ సిద్దిపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన జిల్లా సెషన్ కోర్టు ఫస్ట్ అడిషనల్ జడ్జి నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించారు. ఈ కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన తొగుట సీఐ కమలాకర్, కోర్టు కానిస్టేబుళ్లు లావణ్య, భాస్కర్, రఘు, కోర్టు లైనింగ్ హెడ్ కానిస్టేబుల్ రాజమల్లు లను జిల్లా సీపీ అనురాధ అభినందించారు.

## విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కూలి మృతి


మహేష్(ఫైల్)

రేగోడు, ఏప్రిల్ 22: విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కూలి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన రేగోడులో సోమవారం చోటు చేసుకున్నది. పాపన్నపేట మండలం మల్లంపేట గ్రామానికి చెందిన బోయిని మహేష్(26) మరో ఇద్దరు రేగోడు ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తున్నారు. ఈ క్రమంలో షాక్ తగిలి స్తంభం పైనుంచి మహేష్ కిందపడిపోయాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యుదాఘాతంతోనే మృతిచెందినట్లు విద్యుత్ ఏఈ యాసిన్ తెలిపారు.

## బస్సును ఢీకొట్టిన లారీ, ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

కొండపాక, ఏప్రిల్ 22: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కొండపాక గ్రామం నుంచి రాజీవ్ రహదారి వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. దాంతో బస్సు డ్రైవర్‌కు కాలు విరగ్గా.. ఇద్దరు ప్రయాణికులు శ్రీలత, దిలీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ లక్ష్మయ్యను బయటకు తీసి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## వాహనాల తనిఖీలో రూ.2 లక్షల నగదు పట్టివేత


నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొండపాక, ఏప్రిల్ 22: కొండపాక మండలం నాగులబండ వద్ద సోమవారం వాహనాల తనిఖీలో రూ.2 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు నాగులబండ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా సిద్దిపేటకు చెందిన సుందరయ్య తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2 లక్షలను తీసుకెళ్తున్నాడు. వాటిని పోలీసులు సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీ జరుగుతున్నదని, రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే తగిన ఆధారాలు ఉండాలన్నారు.

### ఐనాపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.60 వేలు...

చేర్యాల, ఏప్రిల్ 22: కొమురవెల్లి మండలం ఐనాపూర్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో సోమవారం పోలీసులు రూ.60 వేల నగదు పట్టుకున్నారు. ధూళిమిట్ట మండలం తోర్నాల గ్రామానికి చెందిన ఆకుల యాదగిరి కారులో నగదు తీసుకుని వెళ్తుండగా.. చెక్‌పోస్టు వద్ద తనిఖీలో సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు పట్టుకుని సీజ్ చేశారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్ సస్పెన్షన్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22: మెదక్ రూరల్ ఎస్ఐ అమర్, కానిస్టేబుల్ బాసిత్‌పై పోలీసు అధికారులు వేటు వేశారు. ఇసుక ట్రాక్టర్ రిలీజ్ విషయంలో గతనెల 19న ఆసులపల్లికి చెందిన కందుల చంద్రం వద్ద స్టేషన్ రైటర్ సురేందర్ రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు రైటర్‌ను విచారించగా ఎస్ఐ, కానిస్టేబుల్‌కు డబ్బులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కేసులో ఏసీబీ అధికారులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన అధికారులు ఎస్ఐ, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

## ఉద్యోగులకు న్యాయం చేయాలి

● రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవోకు టీఎన్జీవో నేతల విజ్ఞప్తి


రామచందర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22: జీవో 317తో నష్టపోయిన పశుసంవర్ధకశాఖ ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో రామచందర్‌కు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఈవో మెదక్ వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 317 జీవోతో పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు నష్టం జరిగిందని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, సంయుక్త కార్యదర్శి శివాజీ, గోపాల్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు చైతన్య ర్యాలీ


ఖేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో దివ్యాంగ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తూ సోమవారం ఖేడ్‌లో వివిధశాఖల అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా కొనసాగింది. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తూ ముద్రించిన బ్యానర్ చేతపట్టుకుని ప్రతీ దివ్యాంగ ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సుజాత, మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి ఇస్మాయిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయండి

● సురేష్‌షెట్కార్ గెలుపే ధ్యేయం
● రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

జోగిపేట, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. సోమవారం, జోగిపేటలోని కాగ్రెస్ కార్యాలయంలో అందోలు-జోగిపేట కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం సాధించాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. వచ్చే 25 రోజులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ వందరోజుల్లో చేపట్టిన అభివృద్ధి, ఆరు గ్యారంటీ పథకాల అమలును వివరించి ఓటర్లను చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యర్తలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా చెక్‌పోస్టుల నిర్వహణ

● ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు
● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్


నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్, హాజరైన పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన జిల్లా నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటర్లను చైతన్యవంతం చేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పాత నేరస్థులు, గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించినవారిని ముందస్తుగా బైండోవర్ చేయాలని ఆదేశించారు. ప్రతీ పోలీసు అధికారి తమ ప్రాంతంలో పోలింగ్ రూట్ మొబైల్ గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. నివాసాలు, ప్రధాన కూడళ్లలో ప్రజలు స్వచ్ఛందంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకునేవిధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎన్నికల విభాగం సీఐ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చీరాలలో శిక్షణ పొందిన మహిళా చేనేత కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అలుగు వర్షిణి


నూలు దారం తీస్తున్న చేనేత కార్మికుడితో కమిషనర్ వర్షిణి

# చేనేత రంగంలో మహిళలు రాణించాలి

● చేనేత, జౌళిశాఖ రాష్ట్ర కమిషనర్ అలుగు వర్షిణి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 22: చేనేత ఉత్పత్తుల రంగంపై మహిళలు ఆసక్తి చూపించాలని రాష్ట్ర జౌళి, చేనేతశాఖ కమిషనర్ అలుగు వర్షిణి సూచించారు. సోమవారం సిద్దిపేటలో పర్యటించిన ఆమె చేనేత సహకార సంఘాలను సందర్శించారు. ఇటీవల సిద్దిపేటకు చెందిన 18 మంది మహిళలు చీరనేయడంపై శిక్షణ పొందేందుకు ప్రముఖ చేనేత గ్రామమైన చీరాలను సందర్శించారు. వారితో కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు అక్కడ నేర్చుకున్న అంశాలను, ఇంకా వారికి అవసరమైన శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. రెండోదశలో మరి కొంతమందిని ఎంపికచేసి వారికి కూడా నాణ్యమైన చేనేత ఉత్పత్తుల తయారీకి మెరుగైన శిక్షణ ఇవ్వనున్నట్లు కమిషనర్ వివరించారు. అనంతరం సిద్దిపేట ప్రత్యేక చీరలైన గొల్లభామ, రామప్ప చీరలు నేసిన కార్మికులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వంద నెంబర్ గల నూలు వస్త్రాలను నేయాలని, చీరల తయారీలో నాణ్యత పాటించాలని సూచించారు. త్వరలోనే మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి చేనేత రంగంలో మహిళల పాత్ర పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఫ్యాషన్ టెక్నాలజీ చాంబర్ ఆఫ్ కామర్స్ చేనేత, జౌళి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేనేత రంగాన్ని ఉత్పత్తులను పెంపొందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, చేనేత శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్, రతన్‌కుమార్, ఏడీ సంతోష్‌కుమార్, ఏడీఏ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయం హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న భక్తులు

రాయికోడ్, ఏప్రిల్ 22: మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయం హుండీ సోమవారం లెక్కించారు. వెండి, బంగారు వస్తువులతో పాటు రూ.3.47 లక్షల నగదు వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్‌పాటిల్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి మే రెండో తేదీవరకు జాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

## తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

● డీపీవో దేవకీదేవి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

మద్దూరు, ఏప్రిల్ 22 : వేసవి దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని డీపీవో దేవకీదేవి పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో చేర్యాల, మద్దూరు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడారు. గ్రామాలకు సరఫరా అవుతున్న మిషన్‌భగీరథతో పాటు గ్రామాల్లోని బోర్ల ద్వారా అందిస్తున్న తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ఎన్నిబోర్లున్నాయి, సింగిల్‌ఫేజ్ మోటార్లు నడుస్తున్నాయా, బోర్లున్నాయా, పైపులైన్ సమస్యలు గానీ ఇతరాత్రా సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో మల్లికార్జున్, ఎంపీవో ఖాజామొయినుద్దీన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మి పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్తను కాల్చివేస్తున్నారు

● ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

● చోద్యం చూస్తున్న అధికారులు

నంగునూరు, ఏప్రిల్ 22: తడి పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీకి నిధులు సమకూర్చాలనే ప్రభుత్వ లక్ష్యం మండలంలో నీరుగారిపోతున్నది. గ్రామపంచాయతీల్లో పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, పచ్చదనానికి ప్రభుత్వం అధిక ప్రాముఖ్యత ఇచ్చింది. వీటి నిర్వహణ పంచాయతీలకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఆదాయ వనరులుగా డంపింగ్ యార్డులను నిర్మించారు. నిత్యం గ్రామంలో తడి, పొడి చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్ యార్డుకు చేరవేస్తున్నారు. అయితే తీరా చెత్తను అక్కడికి తరలించిన తర్వాత తడి, పొడి చెత్తను వేరుచేయకుండా బహిరంగా ప్రదేశాల్లో పారబోసి కాల్చేస్తున్నారు. సేంద్రియ ఎరువుతయారీ ప్రశ్నార్థకంగా మారింది.

### సేంద్రియ ఎరువు తయారీ కోసం

డంపింగ్ యార్డులో తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారుచేయాలి. పొడి చెత్తలో లభించే ప్లాస్టిక్, ఇనుము, గాజు, కాగితాలు తదితర సామగ్రిని వివిధ భాగాలుగా వేరు చేయాలి. గ్రామపంచాయతీలోని డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువుకు ఉపయోగించే వానపాములను కొనుగోలు చేసి సహజ పద్ధతిలో 40నుంచి 60 రోజుల్లో సేంద్రియ ఎరువు తయారవుతుంది. గతంలో సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై కార్యదర్శులకు, సర్పంచులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. కానీ వానపాములను కొన్ని గ్రామాల్లో కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారు.



ముంద్రాయి శివారులోని శ్మశానవాటిక సమీపంలో చెత్తను కాలుస్తున్న దృశ్యం (ఫైల్)

### లోపించిన పర్యవేక్షణ

గ్రామంలో తయారు చేసుకున్న సేంద్రియ ఎరువును గ్రామంలోని పల్లె ప్రకృతివనం, హరితహారంలో నాటిన మొక్కలకు వినియోగించుకోవాలి. మిగిలితే రైతులకు విక్రయించి గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని అధికారులు సూచించారు. మండల, జిల్లా స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎరువు తయారీపై సిబ్బంది దృష్టి పెట్టడంలేదని స్పష్టమవుతున్నది. కొన్ని పంచాయతీల్లో మొదటిసారి తయారు చేసిన ఎరువునే పర్యవేక్షణకు వచ్చిన ఉన్నత అధికారులకు చూపిస్తున్నట్లు సమాచారం

### బూడిదవుతున్న చెత్త

ఇంటింటికి తిరిగి సేకరించిన చెత్తతో ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో ప్రతి గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం లక్షలు వెచ్చింది. అందుకోసం డంపింగ్ యార్డును నిర్మించారు. కానీ నంగునూరు మండలంలోని 24 గ్రామపంచాయతీలో ఒకటి రెండు మినహా అన్ని గ్రామపంచాయతీల్లో చెత్తను సేకరించి ఊరు బయట కాల్చి బూడిద చేస్తున్నారు. ముఖ్యంగా నంగునూరు మండలం ముంద్రాయి గ్రామంలో సేకరించిన చెత్తను శ్మశాన వాటిక సమీపంలో వేసి కాల్చడంతో గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కకు వేసి కాల్చడంతో పర్యావరణానికి నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిపొడి చెత్త వేరు చేయకుండా ఒకే దగ్గర పోసి కాల్చి వేయడం వల్ల గతానికి ఇప్పటికీ ఏం తేడా ఉందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది ఒక ముంద్రాయి గ్రామంలోనే కాదు మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామపంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నంగునూరులో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డ్

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దుబ్బాక, ఏప్రిల్ 22: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన బాల్‌రాజు(45) అనే వ్యక్తి దుబ్బాకలోని మిషన్‌భగీరథలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కూతుర్ని చూడడానికి స్వగ్రామమైన రుద్రారం వెళ్తుండగా హబ్షీపూర్ వద్ద వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటాం

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్/కొండపాక/కుకునూరుపల్లి ఏప్రిల్ 22: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు వంటేరి కొండల్‌రెడ్డితో కలసి కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆహ్వానించారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కందెల రాజ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న శ్రీముత్యాలమ్మ, శ్రీ నల్లపోచమ్మ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలతో పాటు గజ్వేల్ మండలం అనంతరావుపల్లిలో బొడ్రాయి, గ్రామ దేవతల ప్రతిష్ఠా మహోత్సవాలకు నర్సారెడ్డి హాజరయ్యారు. వారితో కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి, గోపాల్‌రావు, గాడిపల్లి భాస్కర్, సుభాష్ చంద్రబోస్, క్యాసారం బాబ, జంగం రమేశ్‌గౌడ్, మల్లారెడ్డి, నక్క రాములుగౌడ్, కిషోర్, జాలిగామ ఎంపీటీసీ రాజిరెడ్డి, మోహన్నగారి రాజు, రామచంద్రాచారి, యాదగిరి, గడ్డం చంద్రం, సురేశ్ తదితరులున్నారు.

ఉమ్మడి కొండపాక మండలంలోని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నాయకుడితో పాటు ఉమ్మడి కొండపాకలోని పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు భారీగా మంగళవారం హైదరాబాద్‌లో సీఎం సమక్షంలో చేరనున్నట్టు సమాచారం. నీలం మధు గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేస్తామని మంగోల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మూష్టం శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహాచారి, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, కిషన్ గౌడ్, జలా యాదగిరి, మహిపాల్‌రెడ్డి, నాగేష్, షాహిన్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషిచేయాలి

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ 9వ వార్డు అధ్యక్షుడిగా నియమితుడైన శ్రీధర్‌ను సన్మానిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/మిరుదొడ్డి ఏప్రిల్ 22: బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అధ్యక్షుడిగా వాజీద్, 9వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడిగా మామిడి శంకర్‌లను నియమించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు శీర్ల శ్యామల మల్లేశం, మామిడి విద్యారాణి శ్రీధర్, బొగ్గుల చందు, నాయకులు విరాసత్‌అలీ, నర్సింగరావు, కరీం, బాకి స్వామి, గంగిశెట్టి రవీందర్, ఉమర్, నాగరాజు, తదితరులున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ భాస్కరచారి, మాజీ ఏఎంసీ చైర్మన్లు బాపురెడ్డిలు అన్నారు సోమవారం మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సుధీర్, అంజిరెడ్డి, సత్యనారాయణ, యాదగిరి, లింగం, నర్సింహ్మారెడ్డి, భైరయ్య, బాల్‌నర్సింహులు తదితరులున్నారు.

## బీజేపీలో చేరిన వివిధ పార్టీల నాయకులు



రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 22: మిరుదొడ్డిలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాయవరం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీఎస్పీ, కాంగ్రెస్‌ల నుంచి 30 మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సదానందగౌడ్, రెడ్డమైన నాగరాజు, రమేశ్, రమేశ్, కుక్కల కరుణాకర్ పాల్గొన్నారు.

## పెద్దకోడూరులో '400పై చర్చ'

చిన్నకోడూరు, ఏప్రిల్ 22: మండలంలోని పెద్దకోడూరు గ్రామంలో నూతన ఓటర్లతో బీజేవైఎం నాయకులు సోమవారం 400 పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండలాధ్యక్షుడు మాతంగి నాగరాజు మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసి మొదటి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు అరుణ్, ప్రధాన కార్యదర్శులు సురేందర్, రాజేష్ స్వామి, అశోక్, శేఖర్, కృష్ణరెడ్డి, శ్రవణ్, హరీశ్, చంద్రమౌళి, రాకేష్, సాయిబాబా, పవన్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణమాఫీపై మరోమారు మోసం

● బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు నాగరాజు

చేర్యాల, ఏప్రిల్ 22: ఆరుగ్యారంటీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పంట రుణమాఫీపై మరోమారు మోసపూరిత ప్రకటన చేయడం తగదని బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బుర్గోజు నాగరాజు అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాటల గారడీ చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రైతులకు రూ2 లక్షల పంటరుణ మాఫీ, రైతుబంధు, నిరుద్యోగ భృతి, ఆసరా పింఛన్ రూ.4వేలు ఇవ్వలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా పంటరుణమాఫీని మరోనాలుగు నెలలు కాలయాపనచేసి మోసం చేశారన్నారు.

## బీజేపీ నేతలపై కేసు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 22: పట్టణంలోని రాఘవేంద్రనగర్ సాయికృష్ణ వెంచర్ సర్వేనెంబర్ 1999లో 120 గజాల ప్లాట్ విషయంలో బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌కు, పట్టణానికి చెందిన గరిక ముక్కు రాజేష్‌కు కొన్ని రోజులుగా వివాదం నడుస్తున్నది. ఈ వివాదం కోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన గరిక ముక్కు రాజేష్ ప్లాట్‌లో ఇల్లు నిర్మాణం చేపడుతుండగా, పత్రి శ్రీనివాస్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి మరో ఐదుగురు వ్యక్తులు కలిసి ఆ ఇంటి నిర్మాణాన్ని కూల్చి రాజేష్‌పై దాడి చేశారు. ఈ సంఘటనపై సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రాజేష్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఏడుగురిపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కాగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి సిద్దిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశాడు.

### 'సమస్యలను పరిష్కరించాలి'

మిరుదొడ్డి, ఏప్రిల్ 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీం శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ఉపాధిహామి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ఆలయ వార్షికోత్సవ ఆహ్వానపత్రిక అందజేత

కొండపాక, ఏప్రిల్ 22 : మండలంలోని దుద్దెడ ఎల్లమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయ ఉత్సవ ఆహ్వాన పత్రికను, బీజేపీ నాయకుడు ఈటెల రాజేందర్, బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డిలకు సోమవారం ముదిరాజ్ సంఘ సభ్యులు అందజేశారు.

### రామరాజుకు ఆహ్వానం

గజ్వేల్, ఏప్రిల్ 22: గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజుకు భద్రాచల దేవస్థానం నుంచి పిలుపువచ్చినట్లు ఆయన తెలిపాడు. గజ్వేల్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ఇటీవల గోటి తలంబ్రాలను కల్యాణానికి అందించేందుకు గాను దేవస్థానం నుంచి పిలుపు వచ్చిందని తెలిపాడు.

### యోగా సమ్మర్‌క్యాంపు

చేర్యాల, ఏప్రిల్ 22: వేసవి దృష్ట్యా సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వతేదీన యోగా సమ్మర్‌క్యాంపు ప్రారంభించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

## పెద్దమ్మ గుడిలో బండి సంజయ్ పూజలు



పందిల్ల పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బండి సంజయ్

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 22: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో జరుగుతున్న బోనాల పండుగలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పాల్గొని పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొట్లపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు కాలిపోయిన తాటి, ఈత వనాలను సందర్శించి గౌడకులస్థులతో మాట్లాడారు. అంతకు ముందు హుస్నాబాద్‌లో బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బండి సంజయ్ పాల్గొని వారితో మాట్లాడారు. ఆయనవెంట పార్టీ ముఖ్యనాయకులు ఉన్నారు.

## చేసిన సేవలే గుర్తింపు తెస్తాయి

● జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

నారాయణరావుపేట ఏప్రిల్ 22: ఉద్యోగ సమయంలో అంకిత భావంతో చేసిన సేవలే గుర్తింపు తెస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుర్రాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏసీరెడ్డి నరసింహారెడ్డి ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా నరసింహరెడ్డి విద్యార్థులకు 35 ఏళ్లుగా ఎన్నో సేవలు చేశారని గుర్తుచేశారు. ఎంతో మందిని డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత నరసింహరెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

● సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

గజ్వేల్/నంగునూరు ఏప్రిల్ 22: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని పాతబస్తీలో గల బస్తీ దవాఖానాను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖనాలో గల రికార్డులను తనిఖీ చేసి, ఓపీ రిజిస్ట్రర్, మందుల స్టాక్ రిజిస్ట్రర్‌ను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్న బస్తీ దవాఖాన వైద్యురాలు గౌతమిని అభినందించారు. వారితో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ అధికారి రవిందర్‌రెడ్డి, బస్తీ దవాఖానా సిబ్బంది ఉన్నారు.

నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందేలా ఓపీ సేవలను పెంచాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రాజగోపాల్‌పేట పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రానున్న వర్షకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, సీజనల్ వ్యాధులపై గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఆయనవెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ నాయక్, ఏవో రవీందర్‌రెడ్డి, డేనియల్ తదితరులు ఉన్నారు.



పాతబస్తీలోని బస్తీ దవాఖానాలోని మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

## వార్షిక ఆదాయ, వ్యయాల వివరాలు వెల్లడించేనా?

● లెక్కల సర్దుబాటుపై ఆరోపణల వెల్లువ

చేర్యాల, ఏప్రిల్ 22: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ వార్షిక ఆదాయ, వ్యయాల వివరాల వెల్లడిలో జాప్యం వహిస్తుండటం పట్ల ఆలయవర్గాల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిసింది. ఏడాదిగా నిర్వహించిన లావాదేవీలు, ఆదాయ, వ్యయాల వివరాలను పొందుపరుస్తూ, నివేదిక రూపొందించి లాభ, నష్టాలను వెల్లండించాల్సి ఉంటుంది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసిన మొదటివారం లోగా ఈ తంతు పూర్తి చేయాల్సి ఉన్నా, ఇప్పటికీ వెల్లడించకపోవడంతో 'చే' బిల్లుల కోసమే జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. జనవరి 7వ తేదీన జరిగిన స్వామి వారి కల్యాణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలతో పాటు మేడారం జాతరను పురస్కరించుకుని 10 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. అంతేకాకుండా సాధారణ రోజులలో భక్తులు వేలాదిగా తరలివచ్చి దండిగా కానుకలు సమర్పించడంతో బుకింగ్ ఆదాయంతో పాటు హుండీ లెక్కింపులలో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఏటా సమకూరిన నికర ఆదాయంలో నుంచి స్వామివారి పేరిట డిపాజిట్ చేస్తున్నారు. కానీ దాసారంగుట్ట అప్రోచ్‌రోడ్డు కోసం డిపాజిట్లు విడుదల చేసి బిల్లులు చెల్లించారు. అంతేకాకుండా క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణం దేవాలయ నిధులతో చేపడుతున్నందున ఈసారి మల్లన్న పేరిట డిపాజిట్ చేస్తారా లేదా అన్న విషయం చర్చనీయాంశమైంది. ఇటీవల కాగ్ చేపట్టిన ఆడిట్‌లోనూ పలు అంశాలలో పొరపాట్లు చోటుచేసుకున్నాయని నివేదిక అందించినట్లు తెలిసింది. ఆయా అంశాలను పరిగణిస్తూ, ఆదాయ, వ్యయాల లెక్కలను సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తిగా మారింది.

### జాతర వల్ల కాస్త ఆలస్యం



ఇతర దేవాలయాలకు భిన్నంగా ఇక్కడ ఆర్థిక సంవత్సరం ముగింపులో బ్రహ్మోత్సవాలు కొనసాగడం వల్ల కాస్త సమయం పడుతుంది. వార్షిక వివరాల నివేదిక తయారీ ప్రక్రియ దాదాపుగా పూర్తి కావచ్చింది. త్వరలోనే వెల్లడిస్తాం.

- కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఈవో బాలాజీ

## మెగా రక్తదాన శిబిరం

రాయికోడ్, ఏప్రిల్ 22: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో సోమవారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దివంగత పట్లోళ్ల దత్తురెడ్డి జ్ఞాపకార్థం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ రాష్ట్ర రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ బాలు, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ మాట్లాడుతూ చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన పట్లోళ్ల మహిపాల్‌రెడ్డిని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనవారు 9492874006 నెంబరుకు సంప్రదించాలన్నారు. శిబిరంలో 33 మంది యువకులు రక్తదానం చేశారు.

## జాతీయస్థాయి సెమినార్‌కు ఇన్‌స్ట్రక్టర్లు

చేర్యాల, ఏప్రిల్ 22: ఈనెల 27, 28తేదీలలో కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే సెమినార్‌కు రాష్ట్రం నుంచి చేర్యాలకు చెందిన పలువురు ఇన్‌స్ట్రక్టర్లు ఎంపికైనట్లు సెన్సాయ్ ఎంఎస్ పాషా తెలిపారు. సోమవారం చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీనియర్ విభాగంలో సొప్పరి ఎల్లాదాసు, విజ్జగిరి ప్రభాకర్, సీహెచ్ మల్లేశం, పొన్నబోయిన నవీన్, జూనియర్ విభాగంలో మోహరా మిరాజ్, జిర్రి లోకేశ్, సీహెచ్ రిషిత్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. సెమినార్‌కు జపాన్ హంబుడోజో ఇన్‌స్ట్రక్టర్ ఇనాడా హాజరు కానున్నారని, ఆయన సమక్షంలో అడ్వాన్స్ టెక్నిక్స్, అయ్యర్ కటాస్, కుమితే, బొంకాయ్ తదితర అంశాలలో శిక్షణ అందించనున్నారని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పెద్దశంకరంపేట తహసీల్దార్ గ్రేస్‌బాయ్ సోమవారం ప్రారంభించారు. రైతులు జొన్నలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్, సీఈవో రవీందర్, ఏఈవో స్వాతి, ఆర్ఐ శరణప్ప, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

● నాగల్‌గిద్ద: జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాగల్‌గిద్ద వెంకటేశం అన్నారు. సోమవారం మండలంలోని సక్రుతండాలో ఏఈవోలు సంతోష్, స్రవంతిలతో కలిసి ఆయన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22: జాతీయ అంధత్వ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహంలో వైద్యులు విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సంతోషి మాట్లాడుతూ అంధత్వ నిర్మూలన కోసం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ వసతి గృహం వార్డెన్ సత్యనారాయణ, వైద్యులు వీర్‌కుమార్, సిద్ధిరాములు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య'



వార్షికోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొండపాక, ఏప్రిల్ 22: మండలంలోని దమ్మకపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### వేసవి సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలి

వేసవి సెలవుల్లో విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని కొండపాక మండలం దుద్దెడ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహచారి తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. విద్యార్థులకు 30 రోజుల విద్యా ప్రణాళిక అప్పగించినట్లు పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌ల్లో చదవడం రాయడం నేర్పించాలని తెలిపారు.

# గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు



మద్దూరు: మాల విరమణకు కొండగుట్టుకు వెళుతున్న మద్దూరు హనుమాన్ భక్తులు

బెజ్జంకి, ఏప్రిల్ 22: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి గరుడ వాహనంపై ఆలయ అర్చకులు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఈ నెల24 నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

మద్దూరు, ఏప్రిల్ 22: మండలంలోని లద్నూరు గ్రామంలో ఈ నెల 24 నుంచి 26 వరకు శ్రీభూలక్ష్మి, శ్రీమహాలక్ష్మి సమేత నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కమిటీ, గ్రామస్థులు తెలిపారు. ఈ నెల 24న ఉదయం పోచమ్మకు బోనాల సమర్పణ, 25న పాతఃకాల దేవతల పూజలు, 26న సాయంత్రం బొడ్రాయికి బోనాల సమర్పణ, 27న దుర్గమ్మ పండుగ, సాయంత్రం దుర్గమ్మకు బోనాల సమర్పణ ఉంటుందని తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### శోభాయాత్రను విజయవంతం చేయాలి

చేర్యాల, ఏప్రిల్ 22 : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నేడు చేర్యాల పట్టణంలో చేపట్టనున్న వీరహనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ ప్రతినిధి తడక లక్ష్మణ్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక రామాలయం నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వరకు నిర్వహించే శోభాయాత్రకు హిందూ భక్తులంతా తరలిరావాలని కోరారు.



బెజ్జంకిలో పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

### మాల విరమణకు హనుమాన్ భక్తులు

మద్దూరు, ఏప్రిల్ 22: మండల కేంద్రంలో హనుమాన్ దీక్ష చేపట్టిన హనుమాన్ భక్తులు సోమవారం మాల విరమణకు కొండగట్టుకు బయలుదేరారు. ఈ విషయమై హనుమాన్ ఆలయ ఆర్చకులు పానుగంటి తిరుపతయ్య మాట్లాడారు. నలభై ఒక్కరోజు హనమాన్ దీక్షా చేపట్టిన భక్తులు అత్యంత భక్తితో అంజనేయస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారని, ఈ సందర్భంగా రెండు రోజుల క్రితం భక్తితో హోమ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.